కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు


ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు



నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

ఆత్మకూరు: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, సీపీఎం నాయకులు రాజశేఖర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్మికుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసేవిధంగా లేబర్‌కోడ్లను తీసుకొచ్చిందన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌కు వినతి పత్రం అందించారు. సమ్మెలో సీఐటీయూ, ఎల్‌ఐసీ యూనియన్, ఐసీఈయూ, రైతు, కౌలురైతు సంఘం, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, ఆశావర్కర్ల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ల నాయకులు విజయ్ కుమార్, రవికుమార్, సుధాకర్, రణధీర్, వలి, సురేంద్ర, మంజుల, ప్రియాంక, లక్ష్మీదేవి, వసుంధర, భారతి, వరలక్ష్మి, నాగరాజు, తిమ్మయ్య, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

- ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమ్మెకు బ్రాంచి ప్రధాన కార్యదర్శి రవికుమార్ మద్దతు తెలిపారు.

- **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలంప్రాజెక్ట్‌లో సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూసీ, సీపీఎం, టీయూసీఐ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శ్రీశైలం–హైదరాబాద్ రహదారిని కొద్దిసేపు దిగ్బంధించారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐ పథకాలు అమలు చేయాలని, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు నాగిరెడ్డి, చిన్నమారెన్న, ఆశీర్వాదం తదితరులు డిమాండ్ చేశారు.

- **నందికొట్కూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తే సహించే ప్రసక్తే లేదని వామపక్షాల నాయకులు వెంకటేశ్వర్లు, మజీద్‌మియ్యా, రఘురామమూర్తి, అర్లప్ప తదితరులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి పటేల్ సెంటర్, రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లగా మార్చడం తగదన్నారు. కార్మికులను, రైతులను కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు బానిసలుగా చేసి దేశ సంపదను వారికి కట్టబెట్టడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తుందని విమర్శించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

- సమ్మెకు సీపీఐ నాయకులు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.
- **కొత్తపల్లి:** సీఐటీయూ, కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం సమ్మె నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబోతున్న లేబర్‌కోడులను రద్దుచేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్.హరిత, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఉమామహేశ్వరి, వీఆర్‌ఏ సంఘం నాయకుడు కలాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్ కుమార్, రైతు సంఘం నాయకుడు జి. దాసు తదితరులు పాల్గొన్నారు.

- **వెలుగోడు:** సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఆరుగుల వద్దకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నాగమోహన్, మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.
- **పాములపాడు:** కార్మిక సంఘాల దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య, స్వామన్న, శివలక్ష్మి, గంగమ్మ తదితరులు బస్టాండ్ సెంటరులో మానవహారం నిర్వహించి, అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు.
- **జూపాడుబంగ్లా:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేజీ రోడ్డుపై అంగన్‌వాడీ వర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ లీడర్లు ప్రసన్నలక్ష్మీదేవి, సరస్వతమ్మ, లలితమ్మ, గురుదేవి, సీపీఎం మండల కన్వీనర్ కర్ల మాట్లాడుతూ కనీస వేతన చట్టం అమలు చేసి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

- **పగిడ్యాల:** తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కన్వీనర్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు సమస్యల పరిష్కారం కోరుతూ ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సావిత్రి అధ్యక్షతన ధర్నా చేపట్టారు. సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ జిల్లా నాయకురాళ్లు ఈశ్వరమ్మ, ఉసేనమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన బి.త్రిపుర రూ.1,00,500 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

విశేష పూజలు


జ్వాలా వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

భక్తిశ్రద్ధలతో బాదర్ల స్వామి చిన్న సరిగెత్తు


పీర్ల చావిడిలో కొలువు దీరిన బాదర్ల స్వామి పీరు


పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో బుధవారం బాదర్ల స్వామి చిన్న సరిగెత్తును కుల మతాలకతీతంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల చావిడిలో కొలువు దీరిన బాదర్ల స్వామికి భక్తులు దట్టీలు, పూల షేరాలతో మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి తర్వాత స్వామి వారి ఊరేగింపు నిర్వహించగా ప్రజలు కాయ, కర్పూరాలు సమర్పించి దర్శించుకున్నారు.

సరుకులు సక్రమంగా ఇవ్వడంలేదని ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన బియ్యం, కందిబేడలు, నూనె ప్యాకెట్లను డీలర్లు సక్రమంగా ఇవ్వటం లేదని అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అలాట్‌మెంట్ అయిన బియ్యం, కందిబేడలు, మంచినూనె వివరాలను తెలియజేయకపోగా మంజూరైన వాటిల్లో కోత విధిస్తున్నారని వివరించారు. సరుకులను కూడా కేంద్రాల వద్దకు సరఫరా చేయటం లేదని, రవాణా ఖర్చులు చెల్లించాలని డీలర్లు అడుగుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన.. డీలర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమంత కుమార్

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమంత కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, బోధనా విధానం, మౌలిక సదుపాయాలను అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ యశోద, ప్రిన్సిపాల్ దాక్షయని ఉన్నారు.

నేడు బూత్‌లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ

జూపాడుబంగ్లా: బూత్‌లెవెల్ ఆఫీసర్లకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ బుధవారం తెలిపారు. ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బీఎల్‌ఓలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

అంకాళమ్మ అమ్మవారికి బోనం


అమ్మవారికి బోనం తీసుకువస్తున్న దేవస్థాన ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆషాడమాస మూలా నక్షత్రం సందర్భంగా లోకకల్యాణం కోసం బుధవారం క్షేత్ర గ్రామదేవత అంకాళమ్మ వారికి దేవస్థానం తరఫున బోనం సమర్పించారు. భ్రమరాంబాదేవి ఆలయం నుంచి శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఎం.ఉమానాగేశ్వరశాస్త్రి, ఆలయ ఏఈఓ ఎం.హరిదాసు, పలువురు అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా నూతన పట్టువస్త్రాలు, పసుపు కుంకుమలు, గాజులు, ఫలపుష్పాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని అంకాళమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించి బోనం సమర్పించారు.

రైతులను దోపిడీ చేయడం తగదు


నాగిరెడ్డితో రైతులు

పగిడ్యాల: ఎరువుల దుకాణ డీలర్లు రైతులపై దోపిడీకి పాల్పడడం తగదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పలువురు రైతులు నాగిరెడ్డిని కలిసి ఎరువుల దుకాణాల డీలర్లు చేస్తున్న దోపిడీని ఏకరవు పెట్టుకున్నారు. స్పందించిన ఆయన వెంటనే నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్, మండల వ్యవసాయ అధికారి మల్లికార్జునకు ఫోన్ చేసి తక్షణమే ఫర్టిలైజర్స్ డీలర్లపై ఫిర్యాదు చేశారు. డీఏపీ, యూరియా తదితర ఎరువులను కొనుగోలు చేయడానికి వెళ్లిన రైతులకు నానో డీఏపీ, నానో యూరియా, జింక్ ప్యాకెట్లను బలవంతంగా అంటగట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాగిరెడ్డిని కలిసిన వారిలో రైతులు శివరామిరెడ్డి, సర్వేశ్వరరెడ్డి, మద్దిలేటి, సుధాకర్, కాటమయ్య, తొండ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీ బృందం ర్యాలీ

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, సోషల్ ఆడిట్ ఉద్దేశాన్ని వివరించారు. ర్యాలీలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏపీఓ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రిపై దాడి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలో బుధవారం ఆస్తి కోసం కన్న తండ్రిపై కుమారుడు దాడి చేశాడు. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కారంపాడి సుబ్బరాయుడుకు అర ఎకర పొలం ఉంది. అయితే తనకు ఇవ్వాలని కుమారుడు రామసుబ్బడు తండ్రి సుబ్బరాయుడితో గొడవపడ్డాడు. ఈక్రమంలో రాయితో తలపై బాదడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. తండ్రి ఫిర్యాదు మేరకు కుమారుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు గురు పౌర్ణమి

ఆత్మకూరు: స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేపడతామన్నారు.

గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

వెలుగోడు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం నిర్వహించనున్న గురుపౌర్ణమి పూజలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు కాగడ హారతితో పూజా కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. రుద్రాభిషేకం, విష్ణు సహస్ర పారాయణం, సత్యవ్రతం, అన్నదాన, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

వెలుగోడు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భవ దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ కార్యాలయం వద్ద సంఘం జిల్లా నాయకుడు వీర బ్రహ్మం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మధుగౌడ్, పురుషోత్తం గౌడ్, మణి, మహేష్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

పగిడ్యాల: ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో బీఎల్‌ఓల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. కొత్త ఓటర్లను నమోదు చేసి, మృతిచెందిన ఓటర్లను తొలగించే సమయంలో పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. తర్వాత బీఎల్‌ఓలకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, ఆర్ఐలు శ్రీరంగారెడ్డి, కళావతి పాల్గొన్నారు.

గ్రామాలు పురోగతి సాధించాలి


పాములపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ప్రతి గ్రామం పురోగతి సాధించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన గురించి చర్చించారు. శిక్షణలో జేఈ రాఘవేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

కొత్తపల్లి: పంచాయతీల ప్రగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ మేరీ, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణలో వారు మాట్లాడారు. అనంతరం జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, పార్థసారథి, కంప్యూటర్ ఆపరేటర్ మహేష్ అధికారులకు అవగాహన కల్పించారు.

- **జూపాడుబంగ్లా:** గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ గోపికృష్ణ, ఎంఈఓ–2 శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల పురోగతిపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు వారి శాఖల పరిధిలో గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేయాలన్నారు.
- **పగిడ్యాల:** డిజిటల్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు బుధవారం పంచాయతీల పురోగతిపై ఎంపీడీఓ సుమిత్రమ్మ అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ వీరన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

ఆత్మకూరు: మోతాదుకు మించి భూములకు ఎరువులు వాడరాదని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన, క్రిమిసంహారక మందులు, ఎరువులను అధికంగా వాడితే భూసారం తగ్గి, పంట బెట్ట సోకే అవకాశం ఉందన్నారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శశికళ, ఏఓ హేమలత, పశుసంవర్ధశాఖ అధికారి అరుణ, పట్టుపరిశ్రమ టెక్నికల్ అసిస్టెంట్ కలాం పాల్గొన్నారు.

- **నందికొట్కూరు:** మండల పరిధిలోని 10 బొల్లవరం, మల్యాల గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలన్నారు. మొక్కజొన్న పంట విత్తనం వేసేటప్పుడు విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు.
- **పాములపాడు:** విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు.
- **బండి ఆత్మకూరు:** మండల పరిధిలోని ఈర్నపాడు, కడమల కాలువ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వెటర్నరీ డాక్టర్ జ్యోత్స్నదేవి పాల్గొని రైతులకు పలు సలహాలు ఇచ్చారు.
- **జూపాడుబంగ్లా:** మండలంలోని పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

అన్నదాతలకు అడవి పందుల బెడద


అడవిపందుల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పొలాన్ని చూపుతున్న రైతు

కొత్తపల్లి: అన్నదాతలను అడవి పందుల బెడద వెంటాడుతోంది. మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన సేపూరి లక్ష్మీనరసయ్య 4 ఎకరాలు మొక్కజొన్న విత్తనాలను నాటారు. గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కన ఉన్న పొలాలపై అడవి పందుల మంద పడి మొలకెత్తిన మొక్కజొన్నలను నాశనం చేశాయి. విత్తనాలు నాటినప్పటి నుంచి ప్రతిరోజు రాత్రి రైతు పొలంలోనే కాపలా ఉండేవాడు. రెండు రోజుల క్రితం రాత్రి అడవి పందులు మందలుగా వచ్చి మొలకెత్తిన మొక్కజొన్న విత్తనాలను ధ్వంసం చేశాయని రైతు వాపోయాడు. పక్కనే ఉన్న రైతు బాబు రెడ్డి పొలంలో కూడా నాశనం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రైతన్నలు ఎకరాకు సుమారు రూ.20 వేల దాకా ఖర్చు చేసి విత్తనం వేశారు. ఇప్పుడు అడవి పందుల దాడి వల్ల మరింత ఆర్థిక నష్టం చేకూరింది. అధికారులు స్పందించి నష్టపోయిన రైతన్నలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని పలువురు కోరారు.



బండి ఆత్మకూరు–ఎర్రగుంట్ల రహదారిలో ఇటీవల నిర్మించిన తారు రోడ్ కుంగి పోయిన దృశ్యం


నెలకే..'తారు' మారు

బండి ఆత్మకూరు: తారు రోడ్డు నిర్మించిన నెల రోజులకే కుంగిపోయింది. బండి ఆత్మకూరు– ఎర్రగుంట్ల గ్రామాల పరిధిలో రూ.3.25 కోట్లతో నెల క్రితం రోడ్డు నిర్మించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రోడ్‌ను ప్రారంభించారు. నెల తిరగక ముందే రోడ్డు కుంగిపోవడం, తారు లేచి పోవడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలిచ్చి నిధులు నొక్కేయడంతోనే పదికాలాల పాటు రావాల్సిన రోడ్డు నెలకే శిథిలమైందని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మౌలాలిస్వామి జార్తలు


మౌలాలిస్వామి మఖానం వద్ద భక్తుల సందడి

మహానంది: గాజులపల్లెలో మౌలాలిస్వామి జార్తలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. కులమతాలకు అతీతంగా ప్రజలు మఖానం చేరుకుని స్వామిని దర్శించుకుని చక్కెర, బాసికాలు, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆషాఢ మాసం ఎఫెక్ట్

మహానంది: మహానంది ఆలయ ప్రాంగణాలు ఆషాడమాసం కావడంతో భక్తులరద్దీ తగ్గింది. కొంత మేరకు భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

మహానంది: సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. బుక్కాపురంలో సీపీఐ మహాసభలను మండల కార్యదర్శి ఆర్.సామేలు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.

సిగటోక మచ్చ తెగులుతో జాగ్రత్త

మహానంది: అరటిలో సిగటోక మచ్చ తెగులుతో జాగ్రత్తగా ఉండాలని ఉద్యాన అధికారి హరేంద్ర రైతులకు సూచించారు. బుధవారం పలు గ్రామాల్లో అరటి తోటలు పరిశీలించి రైతులకు పలు సలహాలిచ్చారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

మహానంది: కార్మికులను బానిసలుగా మారుస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు సోమన్న డిమాండ్ చేశారు. మహానందిలో బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, అంగన్‌వాడీ హెల్పర్లు, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.